# నైమిశారణ్యంలో సత్రయాగం

ఆ స్టేషను పేరు చదివేందుకు మోచేతులానించి బెర్తు మీది నుంచే కిటికీలోకి తొంగి చూచాడు. అప్పటికే చీకటి చేలాంచలాల మధ్య రైలు బండి వేగం పుంజుకొన్నది. పేరు చదవలేదు. ఊరు కనబడలేదు.

అయినా గమ్యం లేనివాడికి, లక్ష్యం తెలియని వాడికి, అన్నీ విసర్జించా ననుకొంటున్న విరాగికి, మాయా జాలంనుండి, మమతానురాగాలనుండి, గతం నుండి, స్వగతాల నుండి, మోహపాశాల నుండి, ముదిత హృదయాల నుండి పలాయనం చిత్తగిస్తున్న పరిత్యాగికి - తనకెందుకో ఆరాటం?

"These beads are causing me lot of discomfort" (ఈ రుద్రాక్షలు చాలా చికాకు కలిగిస్తున్నవి). ఎదటి బెర్తులో పడుకొన్న విదేశీ యాత్రికుడి రెండవసారి పలకరింపు. ఖాదీపైజమా, తేలిక కాషాయ రంగు లాల్చీ, బంగారపు కాంతిగా గడ్డం, తెల్లఫ్రేము కళ్లజోడు - వేరేటో ఊర్ధ్వగ్రహ పరిక్రమ కక్ష్య నుండి జారి ఈ లోకంలోపడ్డ ఆధ్యాత్మికగవేషకుడిగా ఆ యువకుడు, తను "yes?" (అట్లాగా?) అన్నాడు యాదాలాపంగా. కాని తన జ్ఞానపరిధిలో సమాధానం వేరే వుంది.

❖ ❖ ❖

ఈ పాశ్చాత్య అన్వేషకులకు భారత దేశంలో అడుగుమోపిన తక్షణం-ఒక మార్మికానుభూతి, ఒక అలౌకిక లీల, ఒక ప్రాచీమహాత్యం, ఒక పరమార్థగోచరం, ఒక చిన్మయావస్థ కావాలి. ఎన్నేళ్లయినా వేచి వుండగల భారతీయుడి అచల విశ్వాస పరంపర, నిరంతర ప్రార్థన, ఉపవాస నిరీక్షణ దీక్షలు - వాళ్ల వారసత్వం కావుగదా అని తను కళ్లు మూసుకొన్నాడు. ఏ నది ఇనపవంతెన మీదనో రైలు బండి తన వేగాన్ని తగ్గించుకొన్నది.

మళ్లీ అతనిమాటలు - "I got them from Nepal" (వీటిని నేపాల్ దేశం నుండి తెప్పించాను).

"Good, then they are genuine"- (మరీ మంచిది. అవి అసలు సిసలైనవి).

నేత్రాలు విప్పకుండానే తన పూరడింపు-ఎంత దూరం వెనకబడ్డదో తెలీదు.

బోగీలో ఆ చివరగా ఒంటరి నీలపు విద్యుద్దీపం. శరీరం నుండి తెంచుకొని తెంచుకొని దూరంగా విహరిస్తున్న ఆత్మలాగా ఆ కాంతి, ఎవరో ఆధునిక శిల్పి తొలిచిన పర్వత గుహ నుండి నిర్గమన ద్వారాన్ని సూచిస్తున్నట్లుగా ఆ నీలం, చెట్టు తొర్ర నుండి నిక్కి చూస్తున్నట్లుగా అతగాడి రుద్రాక్షమాల. ఈ దృశ్యాల మధ్య, ఈ ద్వైమానసిక కల్లోలాల నడుమ, తను, వేళ్లాడుతున్న త్రిశంకు స్వర్గంనుండి భూపతనమవుతున్నాడు.

"కమలా! కమలా!" అని భయకంపితమైన కేక. ఒడలంతా స్వేద ధారలు. ఒక్కవుదుటున లేచి కూర్చున్నాడు. కాలరేఖ మీద కుండలిని శక్తి కలవరపడుతున్నది.

ఎదుటి బెర్తులో విదేశీయుడు కనిపించలేదు. అతని రుద్రాక్షమాల కట్ల పామువలె తన మెడలో కదులాడుతున్నది.

కీచుమంటూ రైలు బండి అకస్మాత్తుగా ఆగిపోయింది. కొందరు ప్రయాణీకులు దిగిపోతున్నారు. ఎదురుగా 'నైమిశారణ్యం'-అని బోర్డు. తన తలగడగా వున్న సంచీని అట్లే మరచి తనూ బోగీనుండి కాలు కిందపెట్టాడు. స్టేషన్‌కు ఇరుప్రక్కలా ఒక ప్రశాంతమైన అరణ్యం. తెలతెలవారుతున్నది. ఆకాశం మేఘావృతమై వున్నది-అల్లంత దూరాన రెండు నెమళ్లు పురి విప్పుకుని నాట్యం చేస్తూ కేరింతలు కొడ్తూండటం తిలకించాడు.

ఎవరో సాధువు తను విస్మరించిన చేతి సంచీని తెచ్చి ఇచ్చాడు. తన మెడలో రుద్రాక్షమాలవంకనే చూస్తూ "పుణ్యం త్రైలోక్య విఖ్యాతం/తీర్థం నైమిశముత్తమం" అంటూనే సాగిపోయాడు.

తను రైలు కట్టవెంబటే నడక సాగించాడు. చుట్టూ పురాతన వృక్షాలు. రైలు కట్టకిరువైపులా కుశల తుప్పలు. దర్భ తుప్పలు. ఒంటరిగా ఒక నెమలి రివ్వున విడిచిన బాణంలాగా ఎగిరి ఒక మహావృక్ష శాఖాగ్రం మీద వాలింది. ఎదురుగా ఒక నది. చంద్రవంకవలె. తీర్థరాజంవలె. అలసివున్న దేహం ముందుకు అడుగువేయనంటున్నది. నదీ తీరంలో ఒక రాతి మీద కూలిపోయాడు. మళ్లీ కమల కురులు దిద్దుకొంటున్నది. ఆమె మనోహరంగా ఫాలభాగం మీద వాలిన ముంగురులను లావణ్యంగా వేళ్ల కొనలతో సర్దుకోవటం, ఆవలింత వచ్చినప్పుడు పద్మంవలె అరచేతిని అడ్డంపెట్టుకోవటం వయ్యారంగా చీరె కుచ్చెళ్లు సరిచేసుకోవటం-తెరలు తెరలుగా తన కళ్ల ముందు ఉలిక్కిపడి తన బోసి మెడలో పంచముఖి రుద్రాక్షమాలను తడుముకొన్నాడు. ఎంతో

కొంత ప్రశాంతి. ఏదో ఒక ప్రయోజనం.

నదిలో యాత్రికులైన స్త్రీలు స్నానం చేస్తూండగా, పండా శివలాల్ స్నాన సంకల్పం వల్లిస్తుండగా, కమల అదృశ్యమై, చుట్టూ కమ్ముకొస్తున్న అనిమిత్త, అప్రణహిత, శూన్య అనంత చైతన్య నిర్వాణంలో, క్లేశ రహిత శాంతియుత విముక్తి గాథతలో ముందుకు సాగి నదిలోకి దిగాడు.

"కేయం నదీః?" (ఈ నది ఏమిటి?) తనతో పాటు నదిలో దూకిన సన్యాసిని ప్రశ్నించాడు. అతడు మౌనంగా తన వంక చూచి వేరొక సాధువు వంకకు దృష్టి మరల్చాడు. ఆ సాధువు అంటున్నాడు. ఆస్య కృతాశ్మ కబళః(మౌనంగా వుండటానికి నోట్లో మెత్తని రాళ్లు పెట్టుకొన్నాడు). ఓహో-మౌనంగా వుండటం ముని లక్షణం కదా. మాట ఒక పక్షి. ఒక్కసారి వదిలావా-ఎగిరిపోతుంది. నోటిని నిగ్రహించు. నీ ప్రాణాశక్తిని వృథా చేయకు - అని కదా పరమహంస రామక్రిష్ణ వచనం.

"ఓ మాతా, గోమతీ గంగా" అని పండా సంకల్పం ముగించాడు. ఓహో, ఈ నది గోమతి. ఇది నైమిశారణ్యం. పురాతన తపోభూమి. మూడు యుగాలుగా మహా మునులు మెట్టిన పుణ్యభూమి అని స్వర్గధామపు స్వాప్నిక శోభలో ఈ నది అద్భుతమైన గేయాలాపన చేస్తున్నది.

అరణ్యంలో ప్రవేశించాడు. ఎండుటాకుల మీద, ఆకాశంలోని అలోకాన్ని అవలోకించి పులకరిస్తున్న అత్తిచెట్లమధ్య, రావిచెట్ల నీడల్లో, కదంబ వృక్షాల ఛాయల్లో, యోగనిద్రలోవున్న వటవృక్ష ఊరువులను స్పృశిస్తూ నడుస్తున్నాడు. శాంతి, శాంతి., మహాప్రశాంతి. కాలేజీ చదువులో జాన్‌కీట్స్ పద్యం ఎలుగెత్తి పాడాలనిపించింది. ఇంతదాకా తన తోడుగా నడచిన మౌనం గురించి ఆలోచన పోయింది. Thou still unravished bride of quietness..." Thou foster child of silence and slow time" (నేటి దనుక అమలిన కన్యా నవ వధువువు నీవు ప్రశాంతీ! నీరవత స్తబ్ధ కాలమ్ము పెంచిన పసిపాపవు నీవు ప్రశాంతీ!)

పాడుకొంటున్నాడు పాటగా. మాటగా. వెనకనుంచి ముగ్గురు సాధు పుంగవులు నదిలో స్నానానుష్టానాలు ముగించి నడిచి వస్తున్నారు. ఒకే గళంతో శాంత వచనాలు ఆలాపిస్తున్నారు. అంతరిక్ష శాంతిః పృధివీ శాంతిః ఓషధయ శాంతిః వనస్పతి శాంతిః అపః శాంతిః శాంతిరేవ శాంతిః॥ నిర్విణ్ణుడై వింటున్నాడు. తనది కాలేజీలో మార్కుల కోసం సంస్కృత పాఠాలు అంగ్లంలో చదువుకొన్న జ్ఞానం. వాళ్ల మెడల్లో తులసి మాలలు,

చందన మాలలు, స్ఫటిక మాలలు శాంతి సూక్తాన్నే వల్లిస్తున్నట్లుగా వుంది. కాని తన భుజాన వేళ్లాడుతున్న సంచి నుండి ఏదో అశాంతి గీతం వెలువడుతున్నది. ఎదురుగా ఎవరో సాధకుడి చిన్న ఆశ్రమం ముందున్న తిన్నెమీద కూర్చొని సంచీలోకి చేయి జొనిపాడు. కమల తనకు వ్రాసిన ప్రేమలేఖల కట్ట తగిలింది. క్రితం రాత్రి యాత్రికులెవరో వేసుకొన్న నెగడు ఆ చేరువనే సన్నగా వెలుగుతున్నది. తన చేతిలోని ప్రేమ పత్రాల్ని అందులోకి విసిరివేశాడు. మరుక్షణంలో నెగడు భగ్గుమన్నది.

"భాయీ సాబ్... క్యాకర్ రహేహో!"

"అహం నజానామి" (నాకు తెలియదు)నిజంగా తెలియదేమో. భగ్నప్రేమికుడి కల్లోల కేంద్రం.

❖ ❖ ❖

మూడు దినాల క్రితం - ఈ శాంతి ద్వీపం మీద కాలు మోపినప్పుడు, భావాతీత ఆనంద చైతన్యంలో గోమతీ నదీ జలాల్లో మునిగి అన్నిక్లేశాల నుండి విముక్తుడైన శ్రమణుడిగా తన్ను తాను అభినందించుకొన్నప్పుడు, కమల కాయితాలన్నింటినీ అగ్నికి ఆహుతి చేసినప్పుడు, చుట్టూ ఎక్కడా రేడియో రవళులు, టెలివిజన్ తీగెలు, వార్తా పత్రికల అసుర బాణీల శీర్షికలు లేని ఈ సస్యశ్యామల సైకతాల మీద తన పాదముద్రలు ఎవరు గుర్తించగలరు, కమల ద్రోహం ఎంత మేలు చేసిందో. తనిక తన పూర్వాశ్రమ లోభాలకు లొంగిపోనని శపథం పట్టాడు. తనిప్పుడు పెనుగాలిలో అరటిమొక్క కాదు. తన మనో నదీ ప్రవాహం వెనుదిరిగి పోదు అని తలపోశాడు.

కాని ఆ శమనం- ఆకాశవీధిలో అక్షరాల వలె, వేసవి మధ్యాహ్నపు కునుకు వలె క్షణికమైనదని, ఈ చీకటిలో తన ఆకలిలో, కనిపించని హరిత వనంలో, తను కూర్చొన్న వ్యాసగద్దె ముంగిటి పెను వటవృక్షపు ఛత్రం బోధిస్తున్నది, గత యుగపు రహస్యం. ఈ యుగపు సంధిగ్ధం. నిన్నటి రోజున గ్రామీణ యాత్రికుల కరుణతో, వాళ్ల ట్రాక్టరులో మిశ్రీతీర్థం దర్శించటానికి వెళ్ళినప్పటి దృశ్యం - చీకటి చుట్టిముట్టిన వెలుగువలె ఇంకా అనుభూతిలోనే వున్నది. అక్కడే- నిరంతర ద్వంద్వం వలె కమల కనిపించింది.

మిశ్రిత్ తీర్థంలో దధీచి మహర్షి అస్థిదాన స్థలం వున్నది. ఆ మహర్షి పేరనే కుండ్ వున్నది. ఏ దేశపు మానవ ఇతిహాసంలోనూ వూహించరాని మహాత్యాగనిరతి, శిష్టరక్షణకు దుష్టశిక్షణకు బలిదానం అయిన మహాముని చరిత్రవున్నది.

వజ్రాయుధ నిర్మాణకోసం ఇంద్రుడికి ఆ మహనీయుడి వెన్నెముక కావాలి. ఆర్యావర్తం అన్ని దిశలనుండి, హిమనగపు అన్నిశిఖరాల నుండి, గుహల నుండి, కాననాల నుండి ఆశ్రమాల నుండి అశేష సంఖ్యలో తపోధనులందరూ తమ కమండలాలలో పవిత్ర నదీజలాలను తెచ్చారు. ఆ జలాలతోనే దధీచి కుండం ఆవిర్భవించింది. పుణ్యజలాలలో స్నానపునీతుడై మహర్షి తన యోగాగ్నితో భస్మమైనాడు. వెన్నెముకను దానంగా గ్రహించాడు - సురాధిపతి ఇంద్రుడు.

ఈ ఆది వేదభూమిలో అనాది ధర్మాగ్రాములైన రుషివర్యులు - ఇంకెంతమంది చరితలు తనకు తెలియవో? ఈ పురాణ పురుషులు రాజ్యాలు కోరలేదు. స్వర్గధామాలు వాంఛించలేదు. పునర్భవం గురించి తపస్సులు చేయలేదు. ప్రాణికోటి ఆర్తిని నశింపజేయటానికి దుఃఖాలను తప్తం చేయటానికి, ఏ ఆకాశం కింద వారు కొన్ని నిగూఢ శక్తుల్ని అత్యద్భుతంగా వికశింపజేశారో, ఆ ఆకాశం కింద తనిప్పుడు అడుగులు వేస్తున్నాడు. కాని ఆ దధీచికుండు ఇప్పుడు పరిశుభ్రంగా లేదు. బహుశః ఆనందమాయి ప్రేరణతో ఇందిరాగాంధి విరాళంగా యిచ్చిన ధనంతో ఆ కొలనులో మురికి నీరు బయటకు పోయే ఏర్పాట్లు సరిగా జరగలేదు. అక్కడే రాజ మార్గం మీద కుల రాజకీయ పక్షాల పోరు నాపేందుకు పోగయిన పోలీసు బలగాన్ని చూశాడు. అధీరుడై సంక్షుభిత మనస్కుడై, ఏకాకిగా గ్రామీణ యాత్రికుల సంభాషణలు విని సమీపంలో వున్న సీతాకుండ్ మార్గం అనుసరించాడు. అది త్రేతాయుగ సంకేతంగా, శిథిలాల్లో దుఃఖదేవత అశ్రుజలంగా నిలిచి వున్నది. హృదయకల్లోలాన్ని పక్కకు నెట్టి దీనావస్థలో వున్న వాల్మీకి ఆశ్రమ మనబడే పాడుబడి, దిక్కులేని, శిశిర ఋతుమధ్యంలో వన దేవతగా శోభలేని మందిరాన్నీ చూచాడు. ఒంటరిగా యశశ్రీ కాంక్షలేని వంగదేశపు పరివ్రాజకుడు - రామాయణ కాలానికి ఏకైక ప్రతినిధిగా కుండ్ గట్టు మీద కన్పించాడు. ఇక్కడే గదా, సీతాదేవి తన నిరవధిక నిర్వేదాలకు స్వస్తి చెప్పి, తల్లి భూదేవిని ప్రార్థించి, ఆమె వక్షస్థలం మీద తన శిరస్సు నానించి, తను ఆవిర్భవించిన ధాత్రిలోనే కథావశిష్ట రాలైనది? కథావశిష్టరాలైనదా-మరి ఇన్ని యుగాలుగా ఈ లోకంలో నిలచి వున్నదెందుకు? ఎన్ని కావ్యాల నాయికగానో, ఎన్ని విషాద భరిత స్త్రీ జీవితాల నామాంతరంగానో, ఆ సేతు హిమాచలాల పరిధుల్ని దాటి 'నిరపరాధి' పదానికి నిర్వచనంగా, పంచ కన్యల నడుమ, మహా పతివ్రతల నామమధ్యలో, నిత్య ప్రాతఃస్మరణీయురాలై -విస్మరించబడకపోయినా - యీ పురాణ యుగాల స్మారక చిహ్నంగా ఆమె ఇక్కడ నిలదొక్కుకోలేదా? ఈ కలియుగ ప్రజలను వాల్మీకి క్షమిస్తాడా? అనుకొంటూనే వెనుదిరిగాడు. దధీచి అస్థి

స్థలం నుండి ఒక కుక్క తన ననుసరించి తన అడుగుల్లో అడుగువేస్తూ వస్తున్నదని అప్పుడే గ్రహించాడు. కుండు సమీపాన చెట్టుకింద స్త్రీ అమ్ముతున్న పటిక బెల్లం ముక్కను దానికందించాడు. ఈ జిల్లా పేరు సీతాపూర్ అని ఆ స్త్రీయే చెప్పి తన నూరడబరిచింది. తను పూర్వాశ్రమంలో సంవత్సరం నుండీ పెంచుతున్న కుక్కపిల్ల తనను స్టేషన్ దాకా వెంబడించినప్పుడు దాని దృష్టి తప్పించుకోటానికి ఎన్ని పపిచేష్టలు చేశాడో గదా.

అప్పుడు కన్పించింది - కమల వలే ఒక యువతి.

❖ ❖ ❖

ఆ స్త్రీయాత్రిక బృందం ఆంధ్రదేశ సరిహద్దుల్ని దాటి వచ్చిన వారుగా కన్పించింది. కమల వలె వున్న ఆ యువతి కుండు నుండి మూడు దోసిళ్ళ నీళ్లు పైన పోసింది - గట్టు మీద పసుపు కుంకుమలమీద - నిమీలిత నేత్రాలతో ప్రార్థనా వాక్యాలు పఠిస్తున్నది.

"చేస్తిని ముత్యాల స్నానం. తొక్కితిని పుణ్యస్థలం. కోరితిని ఐదవతనం గుట్టుమీదున్న గంగా భవానీ తల్లీ! ఐదవతనం యిచ్చి ఆయుష్షు నియ్యి. ఐదవతనం లేని ఆయుష్షు వద్దు. గట్టెక్కితిని. మెట్టెక్కితిని. మేరు పర్వతం ఎక్కితిని. తొంగి చూస్తిని తుంగభద్ర . నడిస్తిని నక్షత్రపర్వతం. చూస్తిని చుక్కల పర్వతం. గట్టుమీదున్న గంగి గోవులారా. స్నానఫలం, దానఫలం నాకిచ్చి, ఈ పూరి మేసి, ఈ నీళ్లు తాగి యముల వారొచ్చిన శివుల వారనండి. అంత్య కాలానికి హరిదాసులనండి, మరణ కాలానికి మావాళ్లే ననండి". ఐదవతనం ఇంత శక్తివంతమైనదా?

శునకరాజు తన పైజామా పట్టుకులాగుతున్నది. తన స్వప్నం చెదిరి వెనుదిరిగాడు. ఆ యువతి కమల ఎట్లా అవుతుంది? ఆ కమల నాది కాదు. ఈ కమల ఎట్లా అవుతుంది? రెండు యోజనాలు నడిచి పోయాడు - వచ్చిన బాటనే.

వ్యాసగద్దె ముందు, బండమీద, తమోసరస్సు అంచున, జ్వర పీడితుడై, ఆకలో అగ్నిజ్వాలో తెలియని వేడిమిలో, ఇహలోకమో పరలోకమో తన అస్థిత్వ దోలాయమాన ఆవేదనలో పలవరిస్తున్న ఉదయ సంధ్యలో, వ్యాస పీఠ పురాతన పూజారి చూచి నుదుటి మీద చల్లని హస్తం వుంచి లేవనెత్తి, "చింతామాస్తు... చింతామాస్తు" (బాధ పడవద్దు) అంటూనే తన వీపు నిమిరినిప్పుడు, గత రాత్రంగా తనతో జాగరణ చేసిన కుక్కవైపు దృష్టి సారించి అది వృక్షగతుల మధ్య మెల్లగా తన ధర్మరక్షణ ముగిసినట్లు మాయమవుతూండగా, ప్రథమ దర్శనానికై అప్పుడే వచ్చిన బీహారీ మాజీ

ఉపాధ్యాయుడు, వాన ప్రస్థంలో వున్న అతని భార్య సావిత్రీ బెహన్‌లకు తనను వృద్ధ పూజారి అప్పగించాడు.

జగదీశ్‌పాండే తన భుజానికి స్వీయబలాన్ని జతచేసి నడిపించినప్పుడు, సావిత్రీ బెహన్ గోరువెచ్చని జలంలో తేనె కలిపి తన నిస్రాణను పారదోలినప్పుడు, సాత్వికాహారంతో పునరుజ్జీవనం ప్రసాదించినప్పుడు-ఆ స్పర్శ, ఆ ఎదురు చూడని మమతానురాగం. గత జన్మల రుణానుబంధమో, ప్రాచీన యుగాల మునివాటికల ఆతిథ్య పూజా సంకీర్తనమో తెలియక సజల నేత్రాలతోనే తన పేరు చక్రి అని చెప్పాడు.

ఆ తర్వాత కమల వృత్తాంతాన్నీ తెలిపాడు.

❖ ❖ ❖

కమల పూర్తిపేరు కమలా కస్తూరి. ఎప్పటిదో దూరపు బంధుత్వం, కాలేజిలో పరిచయం, ఆ తర్వాత తన చుట్టూ తిప్పుకొన్న మాయాజాలం. గొంతులో జీరతో తన జీవనాడుల్నీ, వక్షోజాల మీద రెండు జడల సయ్యాటలతో తన జవసత్వాల్నీ, చేప కళ్లచూపుల్తో తన మనో నిబ్బరాన్నీ, అల్లకల్లోలం చేసిన అతివ.

ఎన్ని వేదనలనో రగిలించి తన పుస్తకాలనుండి దూరం చేసి, తనే ఆరాధ్యదైవంగా కేంద్రం బిందువై తనను ఉద్యోగాల నుండి దూరం చేసి, వర్షించిన విరహసంగీతాలే వేదసూక్తాలుగా వినిపించి ఉన్మత్తుణ్ణి చేసి, తన డబ్బును విచ్చల విడిగా ఖర్చు పెట్టించినప్పుడుగాని, తనను పెంచిన అక్క ఆ పిల్ల చంచల స్వభావాన్ని గురించి హెచ్చరించినప్పుడుగాని - ఆ మృగనాభి మాయను తను గ్రహించలేదు. తన భవిష్యత్తంతా ఈ రంగుల హరివిల్లు మీద నాట్యం చేస్తూ ఆకాశంలో తారాపథాల్లో విహరించటమేనని స్వప్న వీథుల్లో చిక్కుకొని సత్యాసత్యాలను అవగాహన చేసుకోలేదు. చివరకు ఆ కస్తూరి మృగం - తన సుగంధ వాయువుల్ని తనే అన్వేషించుకొంటూ వేరొక వన వీథిలో విహరిస్తున్నదని చాలా ఆలస్యంగా తెలుసుకొన్నాడు. ఒకానొక మధ్యాహ్నం-తనను రిజిస్ట్రార్ ఆఫీసుకు సాక్షిగా ఆహ్వానించి, ఈ చక్రి అనే నేస్తం తన కెప్పుడూ తారసపడనట్లే, అతని వునికికి పెద్దగా అర్థం లేనట్లుగానే కార్లల్లో తిప్పగల కామేశాన్ని వివాహమాడినప్పుడు గాని ! ఇన్నేళ్ల భ్రమర భ్రమ, ఇన్ని లక్షల ప్రదక్షిణాలు ఈ పుష్పమకరందం తనకు దక్కదని ఊహించాడా ఏనాడైనా? తన కుక్క మెడలో బెల్టులో తురిమి పంపిన ప్రేమలేఖలే ఈ వుదంతానికి పర్యవసానమని పీడకల కన్నాడా?

పాండే అంతా విన్నాడు. అన్నాడు-"రా నాతో..మనిద్దరం కలిసి శాశ్వతమైన సుందర స్వప్నాల్ని దర్శిద్దాం. నైమిశంలో పన్నెండేళ్ల ప్రవచన సత్రయాగం జరిగింది. ఆ ప్రవచనాలను మళ్లీ మళ్లీ విందాం"

జగదీశ్ పాండే ద్వారానే మాతాప్రసాద్ మిశ్రా, రాధేశ్యాం తోను గాఢ పరిచయం కలిగింది. సుఖ్‌రాం వాల్మీకి అనే తోటి పనిచేసే జిజ్ఞాసువుతో ఆదాన్ ప్రదాన్ జరిగింది. పాలమ్ముకొనే ముఖియా, గుజరాత్ ప్రవాసి దేశాయి, గోశాల రక్షకుడు హిమనందన పూజారి, మౌని బాబా, గాయత్రీ స్వామి, భోజనశాల తివారి - వీళ్ళందరి నుండి నైమిశం స్థల రహస్యాల్ని శోధించటం అలవాటయిపోయింది. గడ్డం పెరిగింది.

గోమతి కిరుపక్కలా ప్రాచీన పుణ్యస్థలులు. దేవతలందరూ కలసి స్థాపనచేసిన దేవదేవేశ్వర్, లంకా విజయం నుండి తిరిగి వస్తూ మర్యాదా పురుషుడు శ్రీరాముడు స్థాపించిన సేతు బంధేశ్వర్‌ల గంభీర నీరవ తేజశ్శాంతిలో ఐక్యం కావటం అలవడింది. సతాం సఖ్యం సాప్తపదీనం - ఏడడుగులు ఏ గ్రామీణుడితో కలిసి చరించినా వాళ్లందరూ ఆప్తస్నేహితులైనారు. గోశాలలో గోవులు, సరస్వతీ కుటీరంలో విద్యార్థులు, గోమతీనదీ ప్రస్థానంలో ఇరుపక్కలా శూన్యంగా కనిపించే కణ్వస, కపిలాది పురాతన మునివర్యుల పేర్లతో నిలిచివున్న కుటీరాలు - అందరూ తన్ను గుర్తిస్తారు. నమో మహత్భ్యః (గొప్పవారికి నమస్కారాలు) నమో అర్భకేభ్యః (చిన్నవారికి నమస్కారం) అన్యక్షేత్రే కృతం పాపం, పుణ్యక్షేత్రే వినశ్యతి (ఇతర ప్రదేశాల్లో చేసిన పాపం, పుణ్యక్షేత్రంలా నశిస్తుంది). తన సంచిలో వున్న రెండు పెద్ద నోట్ల కట్టల్ని పాండేగారికి యిచ్చినప్పుడు తన పాత ప్రపంచంతో పరిపూర్ణంగా బంధనాలు విడిపోయాననుకొన్నాడు. ఆ డబ్బుతో శిథిలావస్థలో వున్న సూతగద్దీ చిన్న భవనాన్ని పునరుద్ధరించాలన్న ఆలోచనకు పాండే ఎందుకో నిర్లిప్తత వహించారు. వృద్ధ యాత్రికులకూ తోడుగా తను రైల్వేస్టేషన్‌కు వెళ్లినప్పుడల్లా అక్కడి పోర్టరు చేతులు జోడించి - పలకరించినప్పుడల్లా అందరిలో తననే చూచుకొన్నాడు. అయినా - తనను ఆరేళ్ల కిందట ఒక విశ్వాస జాగరణతో కాపాడిన కుక్కకోసం కనులు సారించి వెతకటం మానలేదు. బహుఃశ తన పురాతన పాశ బంధాల రూపమేమో-యీ కృతజ్ఞత.

ఈ ఆరేళ్ల అన్వేషణ తదుపరి మౌని అమావాశ్యనాడు నైమిష పీఠాధీశ్వర్ శ్రీమద్ జగదాచార్య ఆగమనం, తలవని తలంపుగా తనకొక పిలుపు, ఆ మరుసటి వారంలో తనకు సన్యాసదీక్ష నొసగి అభయానంద గోస్వామిగా నామకరణం. అభయానంద

గోస్వామికిప్పుడొకటే పరిశ్రమ. ఈ పుణ్యస్థలి ప్రాచీనతను కాపాడటమే.

వ్యాస మునీంద్రుడు తన నిరుపమాన భావనా శక్తితో అష్టాదశ పురాణాలను రచించిన ధర్త్రిమీద, జైమినీ రుషివర్యుడికి మహాభారత కథను విశ్వ విజ్ఞాన కోశంగా, జ్ఞాన భాండాగారంగా, వేదోపనిషత్ సారంగా ఆవిష్కరించిన ధరణి మీద, సూతముని శౌనకాది రుషులకు ఆ పురాణాలను ద్వాదశ వర్షాలుగా యజ్ఞంగా ప్రవచించిన అవని మీద, వారి అష్టకోణాల యజ్ఞవేదికల మీద-

-ఆధునిక దుష్ట సంప్రదాయాల నీడ ప్రసరించగూడదు. కట్టడాల పేరుతో ఈ పురాతన వృక్షాల తపశ్చర్యకు భంగం వాటిల్లకూడదు. ఎవరికీ ఏ ఉత్తరమూ వ్రాయనివాడు ఇప్పుడీ విషయాల మీద పత్రికాధిపతులకు వ్రాస్తున్నాడు. ఆనంద మాయికి విజ్ఞాపనలు పంపుతున్నాడు. పాండవులూ ద్రౌపదీ మహాప్రస్థానం ప్రారంభించిన చోటును పరిశుభ్రంగా కాపాడాలి. త్రేతాయుగపు హనుమంతుడు అహి మహి రావణుల్ని సంహరించి రామలక్ష్మణులను భూతలం మీదికి తెచ్చిన మహిమాన్విత స్థలం మీద కలికాలపు గొడుగు నీడ పడగూడదు. ఈ క్షేత్రం లింగధారిణి లలితాదేవి పుట్టిల్లు. లలిత గుడి కాలుష్యానికి గురికాకూడదు. ఏ యుగపు మహర్షులో లిఖించిన శ్రీచక్రం ముందు నాట్యమాడే తుమ్మెదల ఝుమ్మలకు ఆటంకం కలగగూడదు. ద్వాపర యుగాంతంలో మునుల ప్రార్థనలకు చలించి బ్రహ్మయిచ్చిన వరం వమ్ముకాకూడదు. గోస్వామి-నిరంతర దీక్షతో సన్యాసిగా సాధుపూజనేగాక సాయుధ పూజనూ చేస్తున్నాడు. ముఖ్యంగా అతని దృష్టి చక్రతీర్థాన్ని పవిత్రంగా వుంచి రక్షించటమే.

నేమి అంటే అంచు. శం-అంటే శమించుట, ఆగుట. ద్వాపర యుగాంతంలో మహర్షులందరూ బ్రహ్మ వద్దకేగి కలిపురుషుడు ప్రవేశించని పవిత్ర స్థలాన్ని తెలిపితే, మేమక్కడ మా తపశ్చర్యలు కొనసాగించుకొంటామని ప్రార్థించారు. అప్పుడు బ్రహ్మదేవుడు ఒక మనోమయ చక్రాన్ని సృష్టించి, "దీని అంచు ఎక్కడ నేలకు తగిలి ఆగిపోతుందో అది కలి ప్రవేశించని స్థలం" అని నిర్దేశించాడు. అదే నైమిశం. ఆ కొలనే చక్రతీర్థం. ఈ కాలచక్రం ప్రతి యుగంలోనూ సంచరిస్తుంది. ఈ నైమిశంలోనే విశ్రాంతి తీసుకొంటుంది. అందుకే ఋష్యశృంగులు, పిప్పలాది మహర్షులిక్కడ తపస్సు చేశారు.

సూతమహర్షి గద్దెను కాపాడుతున్న వృద్ధుడు - ఆ మహర్షికి ఎన్ని సహస్రాల తరంవాడో - ప్రవచన యజ్ఞం గురించి వివరణ చెప్పాడు. పన్నెండేళ్లలో డెబ్భై రెండు

వేల ఆర్యావర్త, భరత ఖండ మునులు ఈ సత్రయాగానికి వచ్చారు. విన్నారు. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకూ యీ ప్రవచనం జరిగేది. మధ్య 45 నిమిషాల విశ్రాంతి. సాధు గోస్వామి - యీ విషయాలన్నీ ఆంగ్ల పత్రికలకు వ్రాసి పంపుతున్నాడు. కాలుష్య నివారణ శీర్షికకిందే యివి ప్రకటితమవుతున్నాయి. మాజిక్ రియలిజం అని ఒక పత్రికా సంపాదకుడు దీనికి పేరు పెట్టాడు.

❖ ❖ ❖

ఇట్లా పన్నెండేళ్ళు. ఆ సంవత్సరాంతాన జగదీష్ పాండే సహధర్మచారిణి, తన తల్లివంటి తల్లి కాలధర్మం అయిపోయింది. పాండేగారిని అవధూత గోస్వామి తన మౌన ముద్రతోనే పరామర్శిస్తున్నప్పుడు - సూతముని వంశజుడు శ్లోకం చదువుతున్నాడు. "చిత్రం వటుతరోర్మూలే / వృద్ధా శిష్యా గురుర్ యువా! గురోస్తు మౌనం వ్యాఖ్యానం! శిష్యాత్తు ఛిన్న సంశయాః! (చిత్రం కాదా మరి. వటవృక్షం కింద వృద్ధుడైన శిష్యుడు, యువకుడైన గురువు, తన మౌనంతోనే శిష్యుడి సంశయాలను విచ్ఛిన్నం చేశాడు గదా).

లక్నో నుండి పత్రికా విలేఖరులు, విదేశాల నుండి టి.వి. బృందాలు - నైమిశం ప్రవేశించటం ఈ గోస్వామి వల్లనే. ఆ పరిణామం ఎంత మాత్రమూ మంచిదికాదు. దేవీ భాగవతంలో పదహారు ప్రాకారాల మణిద్వీపంలాగా నైమిశం వెలగాలి, కాని కలి పురుషుడి ప్రచారసాధనాల విష సంకల్పంతో కాదు.

అవధూత గోస్వామి పన్నెండేళ్ల తర్వాత మళ్లీ చింతాక్రాంతుడై, పాండేగారితో హిమాలయ దర్శనానికి ప్రయాణ సన్నద్ధుడవుతున్నాడు. బదరికావనం నుండి ఒక యుగంలో మహర్షులు అక్కడి విపరీత శీతలానికి జంకి హిమాలయ పాదాగ్రాలను చేరారు. ఇప్పుడు ఆ బదరికకే తమ ప్రయాణం అనుకొంటున్నాడు.

సంధ్యానుష్టానాలు ముగిసినాయి. గోస్వామి తన కమండలాన్ని అందుకొన్నాడు. చిరుచీకట్లు ముసురు కొంటున్నవి. తన పాదుక కేదోమెత్తని జీవి శరీరం తగిలి వెనుదిరిగి చూశాడు. ఒక శునకం. దాదాపు తన జీవన అంత్యదశలో వున్నది. అలసివున్నది. శుష్కించి వున్నది. వంగి నిశితంగా పరిశీలించాడు. ముఖం మీద గోధుమ రంగు మచ్చ. కాలచక్రం వెనుదిరిగింది.

"మిల్కీ...మిల్కీ..."

కుక్క బలహీనంగానే తోక వూపుతున్నది. వెనుదిరిగి చూస్తూ ముందడుగు

వేస్తున్నది. దానిని పన్నేండేళ్ల ముందు ఏ చేతి వేళ్లతో నిమిరాడో ఆ ప్రేమాస్పద హస్తంతోనే స్పృశించి శరీరాన్ని తడిమాడు. అప్పుడు కనిపించింది. దానిమెడలో తోలు బెల్టుకు ఒక కాగితపు చుట్ట. ఆనాటి ప్రేమలేఖను పోలిన కాగితం.

"కమల...అంత్య దశలో వున్నది. తమ దర్శనం కోసం తుది శ్వాస నిలుపుకొంటున్నది."

❖ ❖ ❖

నారదాశ్రమం దాటి మలుపులు తిరిగి ఒక కుటీరం ముందు మిల్కీ నిలిచి పోయింది. గోస్వామి కుటీరంలోకి నిశ్చలంగా మసక మసక చీకట్లో దృష్టి నిలిపాడు.

"నేను...కమలను...స్వామీ..." అంటున్నది. అస్పష్ట రూపంలో వున్న ఆ స్త్రీ.

"కమలా? ఆ చక్రి లేడుగదా యిక్కడ"

ఆమె మరి మాటాడలేదు. ఆమె శ్వాస ఆగిపోయింది. గోస్వామి కాళ్ల వద్ద శునకమూ తోకాడించటంలేదు.

చుట్టూ నిశ్శబ్దం. అంతా ప్రశాంతి

(గమనిక : మాజిక్ రియలిజం అనే కథా ప్రక్రియా విశేషం గేబ్రియల్ మార్క్వెజ్ సృష్టించింది కాదు. అదివ్యాస సృష్టి - రచయిత)

✿ 'రచన' : జనవరి 1997

"కాలం ఇంకని నది, వంపుల సడి
కాలం మార్మికగతి, తెగని తంత్రి
రహస్తంత్రి ప్రకృతి పురుషుల రతి
అది అవారిత తాండవకేళి,
పార్వతి లాస్య రవళి

-మునిపల్లె రాజు అరణ్యకాలనుండి